క్లుప్తంగా

పార్టీ పూర్వవైభవానికి పాటుపడుతా..



సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న ధన్వంతి

దేవరుప్పుల: అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను తూచ తప్పకుండా పాటిస్తూ కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కోసం పాటుపడుతానని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ ఉమ్మడి జిల్లా జెడ్పీచైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. ఇటీవల టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఎన్నికైన తరుణంలో హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. ఈ విషయమై మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, రాహల్ గాంధీతోపాటు రాష్ట్ర సమస్త యంత్రాంగానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రిని కలిసిన బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు



వెంకట్‌రెడ్డికి సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని చూపిస్తున్న సుధాకర్‌రెడ్డి

తరిగొప్పుల: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బ్లాక్ కాంగ్రెస్ చేర్యాల మాజీ అధ్యక్షుడు అర్జుల సుధాకర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనగామ–హుస్నాబాద్ ప్రధాన రహదారి వడ్లకొండ్ల, గానుగుపహాడ్ మధ్యలో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. బ్రిడ్జ్ నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్‌కు ఫోన్ చేసి పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జ్ నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. యువత నైతిక విలువలు అలవర్చుకుని భవిష్యత్ బాగు చేసుకోవాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు, 112కు సమాచారమందించాలన్నారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన చుక్క రామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రామయ్య కుమారుడు అనిల్‌తో కలిసి 2002–03 పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు స్నేహితుడికి రూ.21వేల సాయం బుధవారం అందజేశారు. పూర్వ విద్యార్థులు కీర్తి నారాయణ, పెసరు రవి, గద్దె సారంగపాణి, ఎండీ అసాద్, తాళ్లపల్లి ప్రభాకర్, బాలరాజు, వరికుప్పల తిరుపతి, చుక్క రాంబాబు, రాజేష్‌లు ఉన్నారు.

'స్థానికం'లో గెలుపు మనదే కావాలి

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూడా మండలంలో కాంగ్రెస్ బలపర్చే అభ్యర్థులను గెలిపించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. బుధవారం నీలిబండతండలో కాల్‌రామ్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాజేష్‌నాయక్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఖరీఫ్ సందడి



దేవరుప్పులలో నాట్లు వేసేందుకు నారు తీస్తున్న మహిళలు



కడవెండిలో వరినాట్ల కోసం దమ్ముచేస్తున్న రైతు, కొంగల సందడి

- ఉపాధి కోసం కూలీలు.. భుక్తి కోసం కొంగలు

దేవరుప్పుల: కాలంపై నమ్మకంతో ముందస్తు పత్తి విత్తనాలు పెట్టి వరుణిడిపై భారం వేసిన అన్నదాతలు వ్యవసాయ బోర్ల నీటిపై ఆధారపడి ఖరీఫ్‌సాగు చేసేందుకు నాట్లు ప్రారంభించారు. కడవెండిలో రైతులు వరిసాగు చేసేందుకు దమ్ము చేస్తుండగా భూసారంలోని పురుగులు తినేందుకు వచ్చిన కొంగలు సందడి చేశాయి. కాగా, దేవరుప్పులలో కేవలం రెండున్నర ఎకరాల పొలంలో నాటేసేందుకు తగిన గిట్టుబాటు కూలి పడకపోయినా బోనీ కొట్టేందుకు 40 మంది మహిళా కూలీలు వ్యవసాయ పనులకు రావడం గమనార్హం.

'శ్మశానవాటిక పేరుతో స్థలం కబ్జాకు యత్నం'

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 164లో భూమిలో శ్మశానవాటిక నిర్మిస్తామంటూ కొందరు సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. ఈ మేరకు గ్రామంలోని సీపీఎం, కాంగ్రెస్ నాయకులు, గ్రామపెద్దలతో కలిసి స్థానిక తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 164లోని లావని పట్టా భూమిని గత ఏడాది గుంటుపల్లి సోమలక్ష్మి తన పట్టాపరిధిలోని రెండు ఎకరాల భూమిని గ్రామ అవసరాల కోసం మాజీ సర్పంచ్ మంతెన అజయ్‌రెడ్డి స్మారకార్థం శ్మశానవాటిక నిర్మించేందుకు ప్రభుత్వానికి అప్పగించిందన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు సర్వే చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికను సైతం సమర్పించారని, అయితే ఇటీవల గ్రామానికి చెందిన అయిత ఆంజనేయులు సదరు భూమి తనదని, అందులో నేనే సొంత ఖర్చులతో శ్మశానవాటిక నిర్మిస్తానని ప్రచారం చేస్తూ ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన శ్మశానవాటికకు అడ్డం తగులుతున్నాడన్నారు. శ్మశానవాటిక పేరుతో సదరు స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయమై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు జాలుకుంట్ల శిరీష్‌రెడ్డి, గొడుగు రాజు, కత్తుల కట్టయ్య, పల్లె రవీందర్, మహబూబ్‌పాషా తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో బుధవారం భవన నిర్మాణ రంగాల కార్మికులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముసిపట్ల నాగమౌళి, ఉపాధ్యక్షుడు చెరుకు ఉప్పలయ్య, కార్యదర్శి ఎడ్ల రాజు, సహాయ కార్యదర్శి వల్లపు రాజు, అర్గనైజర్ ముప్పిడి కృష్ణ, సలహాదారులు ముసిపట్ల నారాయణ, కొన్నె మల్లయ్య, మునిగల యాదగిరి, సతీష్, ఉప్పలయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జీఎంపీఎస్ మండల నూతన కార్యవర్గం..

దేవరుప్పుల: గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భూమండ్ల కుమార్, జక్కుల గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు మోటే దేవందర్ తెలిపారు. బుధవారం కామరెడ్డిగూడెంలోని బీరప్ప ఆలయ ఆవరణంలో భూమాండ్ల కుమార్ అధ్యక్షతన నూతన జీఎంపీఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా వర్రె ఎర్రయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎల బోయిన భిక్షపతి, మహేష్ కంచర్ల సోమయ్య, కేమిడి మహేష్, జంపన్న, అంజయ్య ఎన్నికయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ప్రజలు తమ పిల్లల భవిష్యత్‌కు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న అన్నారు. స్థానిక జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు రాఘవాపూర్, పాంనూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాంనూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కుమారస్వామి తన ముగ్గురు పిల్లలను అదే పాఠశాలలో చేర్పించిన విషయం తెలుసుకుని సత్కరించారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్‌లో ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంఈఓ కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.సంపత్, హెచ్‌ఎంలు రఘుపతి, రేణుక, రజిత తదితరులు ఉన్నారు.



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా కార్తీక్



జనగామ రూరల్: ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా గుంటుపల్లి కార్తీక్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాడుతానని అన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నర్మెట: నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, టీచర్



టైలు, బెల్టులు అందుకున్న విద్యార్థులతో సతీష్

నర్మెట: విద్యార్థులు ఇష్టంతో చదివి మంచిపేరు తెచ్చుకోవాలని హెచ్‌ఎం మెరుగు రామరాజు అన్నారు. బొమ్మకూర్ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.కృష్ణవేణి సొంత ఖర్చులతో సమకూర్చిన గణిత నోట్ పుస్తకాలను 1, 2వ తరగతి విద్యార్థులకు బుధవారం పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ సందర్భంగా నోట్ బుక్స్ అందించిన ఉపాధ్యాయురాలిని తోటి సిబ్బంది అభినందించారు. ఉపాధ్యాయులు రాజ్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి సుజాత, అంగన్ వాడీ టీచర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

హిమ్మత్‌నగర్‌లో..

జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం మంగు జయప్రకాశ్ నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేతిరాత చక్కగా ఉండేలా చూసుకోలన్నారు. ఉపాధ్యాయులు పసునూరి కవిత, కడారి వసంత, గాదె వెంకటస్వామి, వెంగల జితేందర్, దామెర ఉపేందర్, భూక్యా వంశీకృష్ణ, మాధవి పాల్గొన్నారు.

టైలు, బెల్టుల..

తమ్మడపల్లి (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాత గుండెబోయిన సతీష్ విద్యార్థులకు టైలు, బెల్టులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సతీష్ ఉచితంగా టైలు, బెల్టులను అందజేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు మాధవ్, ఆరోగ్యరెడ్డి, సంపత్‌కుమార్, రవీందర్‌రెడ్డి, ఉమ, మహేశ్వరి, సురేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ

జనగామ రూరల్: పట్టణంలోని నెహ్రూపార్క్ వద్ద ఉన్న సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఆ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల హెచ్‌ఎం రెవరెండ్ ఫాదర్ ఎస్.మరియా జోసఫ్ తెలిపారు. మొత్తంగా 33 గోల్డ్, 21 సిల్వర్, 21 కాంస్య మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు బహూకరించారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మెడల్స్ సర్టిఫికెట్లతో విద్యార్థులు, హెచ్‌ఎం జోసఫ్

ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘణపురం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఒక్క బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని, పదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గౌడ సంఘ భవనంలో బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు ఆత్మీయ సమ్మేళనం మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన 17 నెలల కాలంలో చేపట్టిన పథకాలే తప్ప కొత్తగా ఏమీ చేయలేదని, ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు.

నియోజకవర్గంలో ఉంది కాంగ్రెస్ కాదు.. కడియం కాంగ్రెస్సే

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ లేదని కడియం కాంగ్రెస్సే ఉందని అన్నారు. అసలైన సొంత కాంగ్రెస్ నాయకులే విమర్శిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెబుతున్న చేసింది జీరోనని విమర్శించారు. గ్రామాల్లో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీ ఎంపీపీ జయశ్రీ, నాయకులు చేవెల్లి సంపత్, భాస్కర్‌రెడ్డి, శేఖర్, వీరయ్య, భాగ్యలక్ష్మి, గండి యాదగిరి, రాంచందర్, మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

వైద్యసేవలు..

సమ్మేళనంలో పాల్గొన్న రాజయ్య .. బాలుడికి వైద్య సేవలు అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఏదునూరి వీరయ్య మనువడికి న్యూమోనియా రావడంతో రోజుకు మూడు ఇంజక్షన్లు ఇవ్వాల్సి ఉండగా మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేతుల మీదుగా ఓ ఇంజక్షన్ వేయించాడు.

చర్య తీసుకోవాలి

చిల్పూరు: రోడ్డుపై ట్రాక్టర్ కేజ్‌వీల్స్ తిప్పే యజమానులపై చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కృష్ణాజీగూడెం గ్రామం నుంచి చక్రితండా కు ఏళ్ల అనంతరం బీటీ రోడ్డు వేశారు. కాగా, ఇటీవల ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్స్ బిగించి రహదారిపై తిప్పడంతో రోడ్డు పూర్తిగా దెబ్బ తింటోంది. అధికారులు స్పందించి కేజ్‌వీల్స్ తిప్పే యజమానులపై చర్య తీసుకోవాలని కొత్తగొల్ల శ్రీను, వేల్పుల వెంకటయ్య, భీములు, నరేష్, మల్లేష్, రాజయ్య, కుంచాల రాజులు కోరారు.



రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్ కేజ్‌వీల్స్, ఇన్‌సెట్‌లో (దెబ్బతిన్న రోడ్డు)

విద్యుదాఘాతంతో పశువుల మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన పశువులు

జఫర్‌గఢ్: పంట పొలం వద్ద మేత మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై రెండు పశువులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని కోనాయిచలంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు సొంటిరెడ్డి లచ్చిరెడ్డి తన పొలం వద్ద పశువులను మేత మేపుతున్న క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్ష విలువ చేసే రెండు పశువులు మృతి చెందాయని ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొన్నె గ్రామంలో మేడబోయిన రాములు ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్‌లో భాగంగా పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇబ్రహీంపూర్‌లో..

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ శివారు వాగులో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై డి నరేష్ బుధవారం తెలిపారు. ఫతేషాపూర్ గ్రామానికి చెందిన ఉప్పోజు దామోదర్ తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండా ఏఎస్సై బత్తిని కట్టమల్లు, కానిస్టేబుళ్లు సాయికుమార్, సురేష్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. ట్రాక్టర్ సీజ్ చేసి దామోదర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పరామర్శ

నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన మామిడాల రాజయ్య (70) పాముకాటుకు గురై మంగళవారం మృతిచెందింది. కాగా, బీఆర్‌ఎస్ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి..

జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన కన్నెబోయిన ప్రమీల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు బుధవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి

పాలకుర్తి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మల్లంపల్లి, బిక్యనాయక్ తండా, హత్యతండాలో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు.

సమన్వయంతో సత్తా చాటాలి

కొడకండ్ల: బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకు సాగుతూ త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ కోరారు. బుధవారం రామవరం, పాకాల, కొడకండ్లలో ఎంపీటీసీ క్లస్టర్ స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ నైజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ బీఆర్‌ఎస్ పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పాలకుర్తి టౌన్: ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసే విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవతం చేయాలని తెలంగాణ విద్యా పరిక్షణ కమిటీ జిల్లా బాధ్యులు ఎండీ షరీఫ్, ఇమ్మడి అశోక్, శేషగిరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం విద్యా పరిక్షణ కమిటీ రూపొందించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు.

అన్నదానం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో రాజీవ్ చౌరస్తా, సోమేశ్వరాలయం వద్ద బుధవారం అమావాస్య సందర్భంగా అన్న ప్రసదా వితరణ కమిటీల ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. దాతలు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం

దేవరుప్పుల: ఉపాధి హామీ పనులపై ఊరూరా జరిగిన ఆడిట్ నివేదిక విషయమై ఈనెల 27వ తేదీ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె లక్ష్మీనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి హామీ పనుల కింద రూ. 6.98 కోట్ల కూలి వేతనం తోపాటు రూ.75 లక్షల మెటీరీయల్ తదితర పద్దులపై సేకరించిన నివేదికలపై ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసేందుకు సోషల్ ఆడిట్ బృందం, అధికారులు ఉంటారని పేర్కొన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖ అధికారులు బాధ్యతగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో నూతనంగా నిర్మాణం చేసిన గిరిజన హాస్టల్ డార్మెటరీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన హాస్టల్ భవనం పూర్తిగా నిరుపయోగంగా మారిందని తన దృష్టికి వచ్చిన వెంటనే రూ.63.50 లక్షల నిధులు మంజూరు చేయించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి పునఃప్రారంభించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచారన్నారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, ఆర్డీఓ వెంకన్న, డీటీడీఓ ప్రేమకళ, ఏటీడీఓ రూపాదేవి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ కొమురయ్య, ఏఈ వినీల్, హెచ్‌ఎంలు సోమ్లానాయక్, రాజు, హెచ్‌డబ్ల్యూఓ వెంకటేష్, నాగసాగర్ పాల్గొన్నారు.



గిరిజన బాలుర అదనపు డార్మెటరీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సమీకృత డివిజనల్ ఆఫీస్ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ

ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో రూ.26 కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్న సమీకృత డివిజనల్ స్థాయి కార్యాలయాల సముదాయాల భవన నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కడియం బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని హరించింది కాంగ్రెస్సే

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

జనగామ రూరల్: కాంగ్రెస్ పార్టీ 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని హరించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1975 జూన్ 25న భారతదేశ ప్రజాస్వామ్యానికి ఒక చీకటి రోజు అని.. అప్పటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరా గాంధీ తన స్వప్రయోజనాల కోసం అంతర్గత కలహాలు అనే ఒక కుంటిసాకుతో దేశంలో రెండు సంవత్సరాల పాటు ఎమర్జెన్సీని విధించి ప్రజల ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కారన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించి, ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేసి జైల్లో వేశారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి, ఉడుగుల రమేష్, కెవి ఎల్ ఎన్ రెడ్డి,శివరాజ్, ఉమారాణి, దేవరాయ ఎల్లయ్య, రంగు రాములు, కొంతం శ్రీనివాస్, నవీన్ రెడ్డి జగదీష్, శశిధర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, శ్రీమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి



నూతన కమిటీని ప్రకటిస్తున్న ఏలియా

చిల్పూరు: ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు వర్గీకరణతో సాధించిన ఫలితాలను తెలియజేస్తూ జూలై 07వ తేదీన నిర్వహించే ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జ్ చాడ ఏలియా పిలుపునిచ్చారు. శ్రీపతిపల్లి గ్రామంలో బుధవారం ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ముత్యాల సంపత్ అధ్యక్షతన గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడు గడ్డం అజయ్, ఉపాధ్యక్షుడిగా రొడ్డ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పంగ రవిబాబు, కోశాధికారిగా మోతె కొమురయ్య, కార్యదర్శిగా ముక్క బాబు ఎన్నికకాగా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు మారపాక అశోక్, నీరటి రాజు, మోతె రాజు పాల్గొన్నారు.

కేంద్రం మొండి వైఖరి విడనాడాలి

టీజీపీఏడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు వెంకన్నగౌడ్



మండల పరిషత్‌లో అధికారికి సమ్మె నోటీసు ఇస్తున్న వెంకన్న, రామచంద్రు తదితరులు

దేవరుప్పుల : బీజేపీ ప్రభుత్వం కార్మిక రంగంపై మొండి వైఖరి విడనాడాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 27న పీఆర్ కమిషనరేట్ హైదరాబాద్ ఎదుట ధర్నా, జూలై 9న దేశవ్యాప్త కార్మిక రంగాల సమ్మె నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమ్మె నోటీసు అందించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో క్షేత్రస్థాయిలో విస్తృత సేవలు అందించే గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల విషయంలో పాలకవర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. న్యాయపరమైన హక్కుల సాధనకు పోరాటమే ఎకైక మార్గమని, చట్టానికి లోబడి చేపట్టే ధర్నా, సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బస్వ రామచంద్రు, ఎడెల్లి వెంకట్‌రెడ్డి, ఉప్పలయ్య, స్వరూప, జయమ్మ, పద్మ, ఎల్లమ్మ, కళమ్మ, వెంకన్న, ఐలయ్య, పరుశరాములు పాల్గొన్నారు.